
కథ

# ఇద్దరు డాడీలు వద్దు నాన్నా!

ఎమ్. హేమలత

**"అమ్మూ! ఏంట్రా... యింత రాత్రి వేళ ఫోన్‌చేశావ్? అదేంటమ్మా మాట్లాడకుండా అలా ఎక్కిళ్ళు పెట్టున్నావ్? నన్ను చూడాలని ఉందా! బలేదానివి - మొన్న వీకెండ్‌కే కదరా వచ్చి వెళ్ళాను - యింకా మూడ్రోజులు కూడా కాలేదు! సరే.... సరే...! నువ్వలా ఏడ్వకు. మీ అమ్మ కివ్వు ఫోన్. ఏంటి కిన్నెర యింట్లో లేదా?! యింత రాత్రివేళ నిన్ను ఒంటరిగా వదిలి ఎక్కడ కెళ్ళింది? తనూ, వికాస్ ఏదో కంపెనీ డిన్నర్కి వెళ్ళారా! ఓకే అమ్మూ! నువ్వేం వర్రీ అవకు. నేను రెండ్రోజుల్లో హైదరాబాద్ వస్తాను నీ దగ్గరికి. సరేనా... బంగారు తల్లీ! యింక ఏడ్పుమాని పడుకో, బీ బ్రేవ్ మై చైల్డ్..." అంటూ ఫోన్ పెట్టేసిన వినోద్, ఆలోచనలో పడిపోయాడు.**



మొన్న వీక్ ఎండ్‌కి వెళ్ళినప్పుడే అమూల్య చాల డల్‌గా వుండడం గమనించాడు. "ఏంటమ్మా!" అంటే, "ఏం లేదు నాన్నా - చాలాబోర్‌గా వుందిక్కడ, నువ్వు వచ్చావు కదా - యింక హ్యాపీ" అంటూ, హైదరాబాద్‌లో తానున్న ఆ రెండు రోజులు వెంటబడి ఓషన్ పార్క్, ఐమాక్స్, ఈట్ స్ట్రీట్ అంటూ వుషారుగా తిరిగింది. తనకే యిలా తరచు బెంగుళూరు నుండి హైదరాబాద్ వచ్చి హోటల్‌లో స్టే చేసి కూతురితో గడపడం యిబ్బందిగా వుంటోంది. కానీ తప్పడం లేదు.

కిన్నెర, వికాస్‌ని పెళ్ళిచేసుకున్నాక, తనతో పాడి పాడి బాంధవ్యం తప్ప మరే విధమైన అనుబంధం కొనసాగించలేక పోయింది. నిట్టూర్చిన వినోద్, గత స్మృతులను నెమరు వేసుకోవటం నిరుపయోగమైన, ఆ స్మృతులలోంచి బయట పడలేక పోతున్నాడు.

***

కిన్నెర వినోద్‌లది ప్రేమ వివాహం. ఇద్దరూ బెంగుళూరులోని ఓ ఐటీ కంపెనీలో పని చేసేవారు. ఇద్దరి పని వేళలు ఒకటే కావడంతో వాళ్ళిద్దరి మధ్య కొంత సాన్నిహిత్యం, మిత్రత్వం పెరిగింది. కిన్నెరది చెన్నై. ఆ అమ్మాయికి కన్నడం అసలు వచ్చేది కాదు. వినోద్ది విజయవాడ. బెంగుళూరులో రెండేళ్ళుగా పని చేస్తుండడం వల్ల వినోద్‌కి కన్నడం కొంత రాయడం, మాట్లాడడం వచ్చింది. కన్నడం మాట్లాడే వారితో కిన్నెరకేమయిన ప్రాబ్లమ్ వస్తే వినోద్ హెల్ప్ చేసేవాడు, టీజ్ చేస్తూ. తను వుడుక్కుంటూ "మీకన్నా బాగా మాట్లాడడం ఇట్టే నేర్చుకుంటాను చూడండి..." అంటూ చేసి చూపింది కిన్నెర. పరస్పరం అలవాట్లు, అభిప్రాయాలు కలవడంతో ఒకరినొకరు యిష్టపడి పెద్దల అంగీకారంతో కొంతకాలానికి పెళ్ళి చేసుకున్నారిద్దరూ.

పెళ్ళయిన సంవత్సరానికి వాళ్ళ జీవితంలోకి వసంతంలా ప్రవేశించింది అమూల్య. ముద్దులు మూటకట్టే కూతురినిచూసి మురిసిపోయారు వినోద్ కిన్నెరలు. వాళ్ళ మురిపాలను, సంతోషాలను చూసి ఎవరి కళ్ళు కుట్టాయో, ఏ దిష్టి తగిలిందో, అనుకోకుండా కిన్నెరకి హైదరాబాద్‌కి ట్రాన్స్ఫర్ అయింది. పాప తోటి ఎలాగ అన్న ప్రశ్నకి సమాధానమూ అన్నట్లు, వినోద్ తండ్రి రంగారావు అకస్మాతుగా మరణించడంతో, తల్లి కమలమ్మ కొడుకు దగ్గరికి

వచ్చింది. భార్యాభర్తల ఎడబాటు బాధాకరంగానే వుంది. కానీ, తప్పదు కదా!

అలా రెండు సంవత్సరాలు గడిచాక, కిన్నెర రాక పోకలు క్రమేణా తగ్గిపోయాయి. ఒక్కొక్కమారు అమూల్యని తనతోపాటు హైదరాబాద్ తీసికెళ్ళి కొన్ని రోజులు తన దగ్గర వుంచేసుకొనేది. ఇదంతా మొదట్లో సహజంగానే అన్పించినా, రాను రాను వినోద్‌కి కొంత అశాంతిని, అసహనాన్ని కల్గించేది.

అమూల్య అయిదవ పుట్టిన్రోజుకని హైదరాబాద్ వెళ్ళిన వినోద్‌కి కిన్నెరలో అనూహ్యమైన మార్పు కన్పించింది. కిన్నెర ప్రాజెక్ట్ మేనేజర్, వికాస్, కిన్నెరతో అవసరాన్ని మించి సన్నిహితంగా మెలగడం వినోద్‌కి కొరుకుడు పడలేదు. పాప పుట్టిన్రోజు పార్టీ అంతా తనదే అన్నట్లు వికాస్ ప్రవర్తించడం తనకే మాత్రం నచ్చలేదు. అక్కడి వాతావరణం, కృత్రిమంగా, ఇబ్బందికరంగా కూడా అన్పించింది వినోద్‌కి. సరే... తనక్కడ పరాయివాడు కదా! మిగిలిన వాళ్ళంతా రోజూ కల్సే వాళ్ళు కాబట్టి కిన్నెరతో పరిచయం, చనువూ ఎక్కువగా వుండడంలో అతిశయోక్తి లేదనుకొని సరిపెట్టుకున్నాడు. కానీ, తర్వాతి పరిణామాలే అతనిలో ఏవో అనుమానాల్ని రేకెత్తించాయ్.

''అమూల్యని చూడకుండా వుండలేను. నాతోనే వుంచుకుంటాను. ఇక్కడ మంచి స్కూలు చూసి జాయిన్ చేస్తాను...'' అంటూ కిన్నెర చేసిన ప్రతిపాదన విన్న వినోద్ చకితుడైపోయాడు. ఆ విషయమై యిద్దరి మధ్య వాదోపవాదాలు చెలరేగాయి. పోనీ తను హైదరాబాద్ వెళ్ళడమా, కిన్నెర మళ్ళీ బదిలీ మీద బెంగుళూరుకి రావడమా అని ఆలోచిద్దామన్నా కిన్నెర ఏ మాత్రం ఆసక్తి చూపక పోవడం వినోద్‌కి విడ్డూరంగా అన్పించింది.

వినోద్ అనుమానాలకి కిన్నెర ఆఫీసులో పనిచేసే కుమార్ ద్వారా సమాధానం దొరికింది. కిన్నెర, వికాస్ చాలా సన్నిహితంగా మెలుగుతున్నారని తెల్సుకున్న వినోద్ మొదట్లో అవన్నీ పుకార్లని కొట్టిపడేశాడు. ఆ విషయమై కిన్నెర దగ్గర ప్రస్తావన తెచ్చిన వినోద్ మరింత విభ్రాంతికి లోనయ్యాడు. వికాస్, కిన్నెర పనిచేసే కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్. అతనితో జీవితం పంచుకుంటే తన కెరియర్ మరింత పెరుగుతుందంటూ కిన్నెర మాట్లాడుతూంటే నివ్వెరపోయాడు వినోద్. పరస్పర అంగీకారంతో విడిపోదామంటూ ఖరాఖండిగా మాట్లాడుతున్న కిన్నెరని కొత్త మనిషిని చూసినట్లు చూశాడు వినోద్.

'నీతో కలిసి బ్రతకడం యిష్టం లేదం'టున్న భార్యతో జీవితాన్ని పంచుకోవడం నిరర్థకం అన్న నిశ్చయానికొచ్చిన వినోద్, కిన్నెరకి డైవోర్స్ యిచ్చాడు అయిష్టంగానే. అమూల్య కస్టడీ మాత్రం కిన్నెరకే యిచ్చింది ఫ్యామిలీ కోర్టు. వీక్ ఎండ్స్ మాత్రం తండ్రితో గడిపేందుకు అంగీకరించింది కిన్నెర.

***

వర్తమానంలోకి వచ్చిన వినోద్, గత స్మృతులను విదిలించుకొని, సిస్టమ్స్ దగ్గరికి నడిచాడు. రేపటి హైదరాబాద్ ఫ్లైట్‌కి టికెట్ రిజర్వ్ చేసుకోడానికి.

***

ఆఫీసుకి బయలుదేరే హడావిడిలో వున్న కిన్నెర డోర్‌బెల్ రింగవడంతో 'ఈ సమయంలో ఎవరబ్బా!' అనుకుంటూ తలుపు తెరిచింది. గుమ్మంలో వినోద్‌ని చూడగానే ఒక్కమారు విస్మయానికి లోనయింది. 'ఈ రోజు మంగళవారమేగా...' అనుకుంటూ తెల్లబోయి చూస్తున్న కిన్నెరని, ''హలో కిన్నెరా! బాగున్నావా...? నాకు హైదరాబాద్‌లో పనుండి వచ్చాను. అమూల్య స్కూలు కెళ్ళిందా?'' అంటూ పల్కరించాడు వినోద్.

ప్రక్కకి తప్పుకున్న కిన్నెరని దాటుకొని లోపలికి వచ్చాడు వినోద్. కడుపు నొప్పిగా వుందంటూ యింట్లోనే వుడిపోయిన అమూల్య, ''నాన్నా!'' అంటూ వచ్చి వినోద్‌ని చుట్టేసింది. కిన్నెర అయోమయంగా యిద్దర్నీ చూస్తూ వుండిపోయింది.

''అరే! అమ్మూ యింట్లోనే వుందా! సరే - ఎలాగు వచ్చాను కదా! పాపని నేను అలా బయటికి తీసికెళ్తాను'' అన్నాడు వినోద్ అమూల్యను దగ్గరికి తీసుకుంటూ.

''కిన్నెరా! వెళ్దామా?'' అంటూ గది నుండి బయటికివచ్చిన వికాస్, ''అరే! వినోద్ - మీరెప్పుడొచ్చారు?'' అంటూ షేక్‌హ్యాండ్ యిచ్చి, ''కిన్నెరా! పాపని ఒంటరిగా ఎక్కడ వదిలి వెళ్ళడం అన్నావు కదా! యింకేం - వినోద్ వచ్చారు కదా! హి విల్ టేక్ కేర్ ఆఫ్ హర్, లెట్స్...గో'' అన్నాడు.

తనని, అమూల్యని మార్చిమార్చి చూస్తున్న కిన్నెరతో, ''ఔను కిన్నెరా! నాతో అమూల్యని తీసికెళ్తానులే. సాయంత్రం తెచ్చి దింపుతాను...'' అన్నాడు వినోద్. ప్రొద్దుటి నుండి కడుపు నొప్పి అంటూ ముణగదీసుకొని పడుకున్న అమూల్య గంతులేసుకుంటూ వినోద్ వెంట వెళ్ళడం కిన్నెరకి విస్మయంతో పాటు, బాధను కూడ కల్గించింది. కొద్ది రోజులుగ స్తబ్ధంగా వున్న కూతురు వినోద్‌తో అలా వుషారుగా వెళ్ళిపోవడం కిన్నెర దృష్టిని దాటిపోలేదు.

''నాన్నా! నేనిక్కడ హైదరాబాద్‌లో వుండను. నీతో మనింటికి బెంగుళూరు వచ్చేస్తాను..'' ఎంతో స్థిరంగా ఏ మాత్రం తొట్రుపాటు లేకుండా చెప్తున్న అమూల్య తొమ్మిదేళ్ళ అమ్మాయిగా గాక ఎంతో మెచ్యూర్డ్‌గ అన్పించింది వినోద్ కళ్ళకి.

''అదేంటమ్మా! యిక్కడ స్కూలు - అదీ బాగుంది కదా! అయినా, అమ్మ నిన్ను విడిచి పెట్టి వుంటుందా!?''

''నా కిష్టం లేదు నాన్నా! నేనిక్కడ వుండను - అంతే! వికాస్ వున్నారు కదా అమ్మకు - తనతో స్పెండ్ చేయడానికి..''

''తప్పమ్మా! 'వికాస్' అని అనకూడదు. ఎంతయినా ఆయన నీ డాడీ కదా!''

''ఏం కాదు. ఆయన నా డాడీ ఏంటి...! నువ్వే నా డాడీ...'' భుజం చుట్టూ చేతులేసి కూతుర్ని ఆర్తంగా దగ్గరికి తీసుకున్నాడు వినోద్. వికాస్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఈ మధ్య అమూల్య అసహనం వ్యక్తం చేయడం కూడా గుర్తుకొచ్చింది వినోద్‌కి. అమూల్య ఎందుకో చాలా బాధ పడ్తున్నదన్న విషయం గ్రహించి అదేదో నెమ్మదిగా తెల్సుకోవాలన్న నిర్ణయానికివచ్చిన వినోద్, ''సరే... ఇప్పుడీ డిష్కషన్ ఎందుకు! మనం ఈ రోజు ఎక్కడి కెళ్ళాలో - అది డిసైడ్ చెయ్యరా బంగారూ! మీ అమ్మతో నాకు ఆఫీసు పనుందని అబద్ధం చెప్పాను. యిక నీ యిష్టం.


అమూల్య అయిదవ పుట్టిన్రోజుకని హైదరాబాద్ వెళ్ళిన వినోద్‌కి కిన్నెరలో అనూహ్యమైన మార్పు కన్పించింది. కిన్నెర ప్రాజెక్ట్ మేనేజర్, వికాస్, కిన్నెరతో అవసరాన్ని మించి సన్నిహితంగా మెలగడం వినోద్‌కి కొరుకుడు పడలేదు. పాప పుట్టిన్రోజు పార్టీ అంతా తనదే అన్నట్లు వికాస్ ప్రవర్తించడం తనకే మాత్రం నచ్చలేదు.


ఎక్కడి కెళ్దామని నీవంటే అక్కడికి...'' అంటూ అమూల్యని స్వాంతన పరిచాడు వినోద్.

పగలంతా ఎంతో హ్యాపీగా కబుర్లతో హుషారుగా తిరిగిన అమూల్య తీరా సాయంత్రం యింటికి వెళ్దామనే సరికి బిక్కముఖం వేసి, ''ఒద్దు నాన్నా! నేను నీతోనే వుంటాను. యింటికి రాను...'' అని పేచీ పెట్టడం మొదలెట్టింది. కూతురి ఖిన్నవదనం చూసిన వినోద్‌కి కడుపులో దేవినట్లయింది. ''అలా కాదమ్మా! మీ అమ్మకు చెప్పలేదు కదా! తను వర్రీ అవుతుంది. ఇంటికి వెళ్దాం - నేను అమ్మతో మాట్లాడుతానులే...'' అంటూ నచ్చచెప్పి ఒప్పించాడు.

అమూల్యకోసం ఎదురుచూస్తూ కూచున్నట్లుంది కిన్నెర, వినోద్, అమూల్య రావడంతోటే విరుచుపడింది. ''ఇప్పుడు టైము ఎంతయిందో తెల్సా! ఈ రోజు స్కూలు ఎగ్గొట్టావ్! రేపయినా వెళ్ళాలా వద్దా!! ఇంత రాత్రి వరకు..''

''కిన్నెరా! అమూల్యనేమీ అనకు. తనదేమీ తప్పు లేదు. అమ్మూ! నువ్వు లోపలికి వెళ్ళు. కిన్నెరా! రేపు రాత్రి నేను బెంగుళూరు వెళ్తున్నాను. వీలు చూసుకొని రేపు లంచ్‌టైములో చట్నీస్ రెస్టారెంట్‌కు రా! నీతో కొంచెం మాట్లాడాలి'' అన్నాడు వినోద్.

''అదేంటి వినోద్! వున్నట్లుండి యిలా రమ్మంటే...''

''లేదు కిన్నెరా! నేను చాలా సీరియస్‌గా చెప్తున్నాను. రేపు నువ్వు తప్పక వస్తున్నావు..'' అంటూ వినోద్ గబగబ గదిలోంచి వెళ్ళిపోయాడు.

''హలో వినోద్!'' అంటూ అప్పుడే లోనికి వచ్చిన వికాస్‌ని కూడా పట్టించుకోకుండా వెళ్తున్న వినోద్‌ని చూసి కిన్నెర విస్తుపోయింది.

***

''హలో! కిన్నెరా!! ఇటు... ఇటు...'' అంటూ రెస్టారెంటులోకి అడుగుపెడుతున్న కిన్నెరని పిలిచాడు వినోద్. అప్పటికే టేబిల్ రిజర్వ్ చేసి వుండడం గమనించిన కిన్నెర, వినోద్ దగ్గరికి వెళ్ళి కుర్చీలో కూర్చుంటూ, ''ఏంటి వినోద్! యింత అర్జంటుగా రమ్మన్నావ్! ఆఫీసులో నాకు ముఖ్యమైన మీటింగున్నది. అయినా, నీ కోసం వచ్చాను''.

''చాలాథాంక్స్! నీ కోసం, నా కోసం కాదు కిన్నెరా! మనం కల్సుకుంటున్నది - కేవలం అమూల్య కోసం''.

''అదేంటి!? అమూల్యకేమయింది? నిన్ననేగా

దాన్ని కలిసావ్''

''అమూల్యకి ఏమీ కాకూడదనే...'' అంటూ, టేబిల్ దగ్గరికి వచ్చిన బేరర్ కేసిచూస్తూ, ''కిన్నెరా! నువ్వేం తీస్కుంటావ్? నేనయితే తాళి ఆర్డర్ చేశాను'' అన్నాడు వినోద్, కిన్నెర వైపు తిరిగి.

''నాకేం వద్దు. ఒక కప్పు కాఫీ చాలు... అసహనంగా అంది కిన్నెర.

''నీ యిష్టం...'' అని బేరర్‌కి ఆర్డర్ ప్లేస్ చేసి, కిన్నెరా! అమూల్యలో నువ్వేమి మార్పు గమనించలేదా. ఈ మధ్యలో...'' అంటూ, అసలు విషయంలోకి వచ్చాడు వినోద్.

''అమూల్యలో మార్పా...!'' అని ఒక్కక్షణం ఆలోచనలోపడ్డ కిన్నెర, ''కొంత డల్‌గా వుంటున్నది. ఈ కాలం పిల్లలకి మూడ్స్ - క్షణం క్షణం - మారడం సహజమేగా...'' అంటూ తేల్చిపారేయ బోయింది.

''కిన్నెరా! యిది నువ్వనుకున్నంత చిన్నవిషయం కాదు. నేను నిన్న అంత అర్ధాంతరంగా హైదరాబాద్ ఎందుకు వచ్చాననుకున్నావ్? మొన్నటి రోజు మీరేదో పార్టీకెళ్ళినప్పుడు అమూల్య నాకు ఫోన్ చేసి ఒకటే ఏడ్పు. నన్ను రమ్మని వెక్కిళ్ళ మధ్య మాట్లాడుతూంటే..''

తుళ్ళిపడింది కిన్నెర. ''ఏంటీ! నీకు కాల్ చేసిందా! సరే! అంత ఏడ్వాల్సిన అవసరం ఏమొచ్చిం దట!'' కలవరపాటును కప్పి పుచ్చుకుంటూ, కోపంగా అంది. కిన్నెర కంఠంలో అసహనంతో పాటు, చిరాకు కూడా ప్రస్ఫుటమవుతోంది.

''కిన్నెరా! నువ్వూర్కే ఉద్రేక పడకుండా నేను చెప్పేది శాంతంగా విను. నీకు అమూల్య మీద ఎంత ప్రేమ, కన్‌సర్న్ వుందో నాకు తెలియంది కాదు. కానీ మనం ఆ చిన్నప్రాణి దృష్టికోణం నుండి కూడా ఆలోచించాలి. ఈ మధ్య రెండు మూడు తడవులుగా అమూల్య నాతో వీక్ ఎండ్స్ గడిపినప్పుడు కూడా కొంచెం డ్రిప్రెస్డ్‌గ అన్పించేది. కాని, నేనదేమీ సీరియస్‌గా తీసుకోలేదు. నిన్న మాత్రం...''

మాటాలాపేసిన వినోద్‌కేసి చూసి కిన్నెర, ''ఆగిపోయావేం? చెప్పు - తనకొచ్చిన ప్రాబ్లమ్ ఏంటో...'' అంది నిబ్బరంగా వుండాలని ప్రయత్నిస్తూ.

ఇక విషయాన్ని నాన్చడం అనవసరమని నిర్ధారణ కొచ్చినట్లుయి, ''కిన్నెరా! అమూల్యని నాతో బెంగుళూరికి తీసికెళ్తాను. తనిక్కడ నీతో వుండనని పేచీ పెడుతున్నది'' అన్నాడు వినోద్ కొంచెం బాధగానే అయినా స్థిరంగా.

''ఏంటీ! అమూల్యని తీసికెళ్తావా? అలా అని నీతో అన్నదా? చిన్న పిల్ల ఏదో అంటే - నువ్వది పెద్ద ఇష్యూ చేస్తున్నావే!'' అంది కిన్నెర ఆవేశంగా.

''కిన్నెరా! నీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు. నువ్వన్నట్లు అమూల్య చిన్న పిల్లలాగ మాట్లా డ్డం లేదు. అయినా, ఈ కాలం పిల్లల్లో - ముఖ్యంగా ఆడపిల్లల్లో - చాలానే మెచ్యూరిటీ వుంటున్నది. ఇంతకీ అమూల్య మనసు ఎంతగా గాయపడిందో చెప్తే నువ్వు చాలా అప్‌సెట్ అవుతావు'' అన్నాడు వినోద్.

''ఓహో! అప్పటికి నువ్వొక్కడివే అమూల్యకి ఆప్తుడయినట్లు మాట్లాడుతున్నావే! ఆడపిల్ల - తల్లి దగ్గర చెప్పుకోలేని బాధలు, కష్టాలు - తండ్రితో చెప్పుకుందా?''

''ఊర్కే ఆవేశపడి ఒకరినొకరు నిందించుకోవడం కాదు మనమిప్పుడు చేయాల్సింది. ఆ పసిదాని మనసుకు వూరట కలించాలి. ఇంకా దాపరి మెందుకు? నాతో తనేమందో తెలుసా? 'నాన్నా! మా ఫ్రెండ్స్ - మా కందరికి ఒక డాడీయే వున్నాడు. కానీ అమూల్యకి మాత్రం ఇద్దరు డాడీలు... అంటూ ఏడిపిస్తున్నారు నాన్నా!' అంటూ గుక్కపెట్టి ఏడ్చింది...''


నివ్వెరపోయింది కిన్నెర. మాటలు రానిదయి వినోద్‌కేసి చూస్తూ వుండి పోయింది.

''వీక్ ఎండ్స్‌కి నాతో అమూల్యని చూసిన వాళ్ళ ఫ్రెండ్స్‌కి నేనే అమూల్య డాడీ అని తెల్సు. నువ్వు అమూల్య స్కూలుకి పేరెంట్స్ డే ఫంక్షన్‌కి వికాస్‌తో వెళ్ళావు కదా!''

''ఔను. అందులో తప్పేమంది. వికాస్, అమూల్యకిప్పుడు డాడీ స్థానంలో వున్నాడు కదా!''

''అని నువ్వనుకుంటున్నావు. కానీ అమూల్య అలా అనుకోవడం లేదు కిన్నెరా! ఈ కాలం పిల్లలు మనకన్నా చాలా తెలివైన వాళ్ళు. పిల్లల మనస్తత్వం వారి శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు, ఎప్పుడెలా మారుతుందో మనకు అర్థం కాదు. రెండేళ్ళకి ముందు వికాస్‌ని డాడీగ కాక పోయినా, ఓ ఫామిలీ మెంబరుగా ఆక్సెప్ట్ చేసిన అమూల్య యిప్పుడెందుకో అలా చేయలేక పోతోంది. చెప్పలేనంత అనీజీగా, ఇన్‌సెక్యూర్‌గా ఫీల్ అవుతుంది. కారణాలు ఏమైనా కానీ! నేనింత కన్నా ఎక్కువ వివరించలేను.

ప్రసంగాన్ని పొడిగించడం యిష్టం లేనట్లు, బేరర్ తెచ్చిపెట్టిన బౌల్‌లో చెయ్యి కడుక్కొని, ''ఇక వెళ్దామా...'' అంటూ లేచాడు వినోద్. కీ యిచ్చిన బొమ్మలాగ కిన్నెర కూడా లేచింది. ''సాయంత్రం మీ ఫ్లాట్‌లో కలుద్దాం..'' అంటూ బేరర్ అందించిన చేంజ్‌ని కొంత ప్లేట్‌లో పెట్టి బయటకు నడిచిన వినోద్ వెనకే కిన్నెర కూడా నడిచింది.



వినోద్ ఎక్కిన ఆటో కదలగానే, తను వచ్చిన కార్లో ఎక్కి కూచుంది కిన్నెర.

సాయంత్రం కిన్నెర ఫ్లాట్‌కి వెళ్ళిన వినోద్‌కి కాలింగ్ బెల్ నొక్కే అవసరం లేకుండా తలుపులు తెరిచే వున్నాయి. ఒక సోఫాలో కిన్నెర, వికాస్ వుదాసీనంగా కూచుని వున్నారు. వినోద్ గదిలోకి రాగానే అమూల్య సుడిగాలిలా దూసుకొని వచ్చి వినోద్ చేయి పట్టుకొని నిల్చుంది. ఆ పిల్ల ముఖం చూస్తే చాలా సేపటి నుండి ఏడుస్తున్నట్లు అర్థమయ్యింది వినోద్‌కి. అమూల్యని దగ్గరికి తీసుకున్న వినోద్, కిన్నెర వెక్కిళ్ళు పెట్టడం గమనించి, ''కిన్నెరా? ఏంటది?'' అన్నాడు బుజ్జగింపుగా.

''నీ ఆశయం, కోర్కె నెరవేరాయి కదా! అమ్మూని నా దగ్గర నుండి దూరం చేయాలని చాలానే ప్లాన్లు వేసినట్లున్నావు. ఇప్పుడు నీకు సంతోషమే కదా!''

''ఉష్! ఏంటిది కిన్నెరా...'' అన్నాడు వికాస్ మందలింపుగా.

''వికాస్! మీరేమీ అనుకోకపోతే నేను కాస్సేపు కిన్నెరతో మాట్లాడాలి. ఇది నాకు కిన్నెరకి సంబంధించిన విషయం...'' అన్నాడు వినోద్ కొంచెం ఇబ్బందిగా.

''ఓ ష్యూర్...'' అంటూ, అక్కడే వున్న లాప్‌టాప్ అందుకొని గదిలోకి వెళ్ళిపోయాడు వికాస్.

''కిన్నెరా! కాస్త ప్రాక్టికల్‌గా ఆలోచించు. అమ్మూని బలవంతంగా నీ దగ్గర వుంచుకోలేవు. ఏమ్మా - అమ్మూ! అమ్మ చూడు. ఎంత బాధపడ్తుందో! మరి నువ్విలా తనని వదిలి నాతో వచ్చేస్తే ఎలా...'' కూతురివైపు తిరిగి అన్నాడు వినోద్.

''నాన్నా! నేనీ స్కూల్లో చదవను. బెంగుళూరులోనే చదువుతాను. నానమ్మ దగ్గర వుంటాను. కావాలంటే అమ్మని వీక్‌ఎండ్స్‌కి బెంగుళూరుకి రమ్మను..'' ఎంతో దృఢంగా అంటున్న అమ్మూలని అలా చూస్తూ వుండిపోయిన కిన్నెర పూనకం వచ్చిన దానిలా లేచి, ''ఏమే! నీకేం తక్కుం చేశానే నేను. చెప్పు. నన్నిలా దోషిలా నిలబెట్టున్నావే!'' అంటూ దగరికి రాబోయిన తల్లిని విదిలించి ఏడుస్తూ వెళ్ళి వినోద్ వెనక నక్కింది అమూల్య.

కూతురు తిరస్కారాన్ని తట్టుకోలేకపోయిన కిన్నెర సోఫాలో కూలబడి మళ్ళీ ఏడవసాగింది. తల్లీ - కూతుళ్ళిద్దరు ఏడవడం భరించలేక నిరుత్తరుడయి నిలబడిపోయాడు వినోద్.

కాస్సేపటికి తేరుకున్న కిన్నెర, ''తీసికెళ్ళండి దాన్ని నా దగ్గరి నుండి...'' అంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

''ఊర్కో కిన్నెరా!'' అంటున్న వికాస్ మాటలను లెక్క చేయనట్లు కిన్నెర, ''వికాస్! నేను పెద్ద తప్పు చేశాననిపిస్తోంది - మళ్ళీ పెళ్ళిచేసుకొని - నా కూతురే నన్నిప్పుడు కాదనడం నేను భరించ లేకుండా వున్నాను. దాన్ని చూడకుండా నేనెలా వుండగలను వికాస్..''

హృదయ విదారకంగా ఏడుస్తూ మాట్లాడుతున్న కిన్నెరకు ఏం చెప్పి వూరడించాలో అర్థం కానట్లుండిపోయాడు వికాస్.

''పద నాన్నా! మనం వెళ్దాం...'' అంటూ ముందుకు లాగుతున్న కూతురు అమూల్యని వారించలేక ముందుకు నడిచాడు వినోద్.

కిన్నెర వెక్కిళ్ళు అతన్ని వెంటాడుతూనే వున్నాయ్.

*

చిరునామా
**ఎం. హేమలత,**
**202 గాయత్రి అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం.1,**
**బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034**